సాక్షి
కాకినాడ
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



నిత్యాన్నదానానికి విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కేపీ నాయుడు (బెంగళూరు) శుక్రవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. దాతకు సిబ్బంది అన్నదానం బాండ్ అందజేశారు.



మందపల్లిలో రూ.లక్ష

కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి అన్నప్రసాద ట్రస్ట్‌కు వెలివెల సాయి నమీర్ (తుని) రూ.1,00,050 విరాళంగా అందజేశారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

కల్లాంను మర్యాద పూర్వకంగా కలసిన కలెక్టర్



అజేయ కల్లాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: నగరానికి వచ్చిన రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ, ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లాంను కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య శుక్రవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

12న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనీ గ్రూప్ కంపెనీలో రిలేషన్‌షిప్ మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, సేల్స్; నిట్ ఐసీ ఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్; సీఐఈ ఆటోమోటివ్ ఇండియా లిమిటెడ్‌లో టెక్నీషియన్; డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ ప్రొడక్షన్; ఇసుజు మోటార్స్, డిక్సన్ కంపెనీల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఈ మేళా నిర్వహిస్తున్నారని వివరించారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకూ జీతం, ఉద్యోగాన్ని బట్టి ఇన్సెంటివ్‌లు, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు. డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద శిక్షణ ఇచ్చి కూడా ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు.


92.7 శాతం బాలలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థినికి మాత్ర వేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహ నాయక్

కాకినాడ క్రైం: జిల్లాలో శుక్రవారం నులిపురుగుల నివారణ కార్యక్రమం జరిగింది. నగరంలోని ఏఎఫ్‌సీ మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి నరసింహ నాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన బాల బాలికలకు ఈ మాత్రలు వేశామని ఆయన చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 4,61,684 మందికి గాను తొలి రోజు 4,28,158 మంది బాలలకు (92.7 శాతం) ఈ మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. ఈ నెల 16న మరోసారి ఈ కార్యక్రమం నిర్వహించి నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని నరసింహ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అరుణ, డీఐఓ డాక్టర్ రత్నకుమార్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీజీ నాయకుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఎన్జీజీ సంఘం నేతలు

కాకినాడ సిటీ: ఏపీఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం శుక్రవారం ఎన్జీవో హోంలో జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామమోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఐఆర్ చెల్లింపు, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపుదల, ఓపీఎస్ అమలు, హెల్త్ కార్డులు, పెండింగ్ డీఏ బకాయిలు, జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ, ఎల్ఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర అంశాలపై నాయకులు చర్చించారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమానికి వెళ్లాలని నిర్ణయించారు. దీనికి అన్ని యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ కృతికా శుక్లా
- సమన్వయ శాఖల అధికారులతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా, అధికారులు

కాకినాడ సిటీ: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు సమన్వయంతో వ్యవహరించి, పటిష్ట ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలతో పాటు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షల నిర్వహణపై రెవెన్యూ, పాఠశాల విద్య, ఇంటర్మీడియెట్, ఓపెన్ స్కూల్ సొసైటీ, పోస్టల్, జిల్లా పరిషత్, పోలీసు, రవాణా, విద్యుత్, వైద్య, ఆరోగ్యం, ఆర్టీసీ, పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాలు, పరీక్ష పత్రాల స్టోరేజ్ పాయింట్లు, పోలీసు బందోబస్తు, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల జనరల్‌తో పాటు ఒకేషనల్ విద్యార్థులకు వచ్చే నెల 1 నుంచి 20వ తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగే ఇంటర్ పరీక్షలకు 44,179 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వివరించారు. అలాగే, వచ్చే నెల 18 నుంచి 30వ తేదీ వరకూ రెగ్యులర్ పదో తరగతి పబ్లిక్ పరీక్షలతో పాటు ఓపెన్ (ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్) పరీక్షలు జరగనున్నాయని చెప్పారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకూ జరిగే రెగ్యులర్ పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 137 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 32,230 మంది ఈ పరీక్షలు రాయనున్నారని వివరించారు. అలాగే, ఓపెన్ ఇంటర్, ఎస్ఎస్‌సీ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకూ జరగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షలకు 8,751 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అన్ని పరీక్షలూ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. స్టోరేజ్ కేంద్రాల నుంచి పరీక్ష పత్రాలను సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేర్చడం నుంచి జవాబు పత్రాలను తిరిగి పోస్టాఫీసుకు పంపే వరకూ ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా అన్ని కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకుని, తిరిగి ఇళ్లకు చేరుకునేలా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని వైద్య, ఆరోగ్యం, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. 144 సెక్షన్ అమలు, బందోబస్తు, భద్రతా చర్యల విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, అడిషనల్ ఎస్పీ జీఎన్‌వీ భాస్కరరావు, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీపీఓ కె.భారతీ సౌజన్య, డీఐఈఓ జీజీకే నూకరాజు, ఆర్టీసీ ఆర్ఎంఓ ఎం.శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి జె.నరసింహ నాయక్, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వి.రాజశేఖర్, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ సెక్రటరీ ఎం.వెంకటరావు, ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి పి.సాయి వెంకటరమణ, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, రవాణా అధికారులు పాల్గొన్నారు.

శరవేగంగా..

- జోరుగా ఈ-క్రాప్
- జిల్లాలో రబీ వరి విస్తీర్ణం 1.87 లక్షల ఎకరాలు
- ఈ-క్రాప్ పూర్తయినది 1.76 లక్షల ఎకరాలు
- వంద శాతం నమోదుకు అధికారుల కృషి



సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అన్నదాతకు అడుగడుగునా మేలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. పంటలు పండించే రైతులు.. వాటిని అమ్ముకొనేందుకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదు విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత రబీలో ఈ-క్రాప్ నమోదు జిల్లా వ్యాప్తంగా శరవేగంగా సాగుతోంది. దీనిని వంద శాతం పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

నమోదు చేస్తున్నారిలా..

రబీలో జిల్లావ్యాప్తంగా రైతులు 1.87 లక్షల ఎకరాల్లో వరి, 86 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు, మరో 4 వేల ఎకరాల్లో చెరకు, ప్రత్తి, మినుము, రాగుల వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఇలా వివిధ పంటలు పండిస్తున్న ఏ ఒక్క రైతునూ విడిచి పెట్టకుండా ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) పరిధిలోని గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు ఈ-క్రాప్ ముమ్మరంగా నమోదు చేస్తున్నారు. రైతులను వారు పండిస్తున్న పొలాల వద్దకు తీసుకుని వెళ్లి, జియో ఫెన్సింగ్ ఆధారంగా ఆ పంట సరిహద్దులను ఆర్‌బీకే సిబ్బంది నిర్ధారిస్తున్నారు. అనంతరం ఆ పంట వద్ద సంబంధిత రైతు ఫొటో తీసుకుని ఈ-క్రాప్ నమోదుకు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో పాటు ఆ రైతు ఆధార్, ఫోన్ నంబర్, బ్యాంకు ఖాతా, కౌలు రైతు అయితే సీసీఆర్‌సీ తదితర వివరాలు పక్కాగా నమోదు చేస్తున్నారు.

ఈ-క్రాప్ ఎందుకంటే..

వ్యవసాయ శాఖకు సంబంధించి రైతులు ఏ పథకం అందుకోవాలన్నా ఈ-క్రాప్ బుకింగే ఆధారం. పథకాలను నిజమైన లబ్ధిదారులకు అందించే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ-క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటోంది. రైతులు ఈ-క్రాప్ చేయించుకొనకోతే ఎటువంటి పంటల బీమా వర్తించదు. అంతే కాదు.. పంట దిగుబడులు అమ్ముకోవాలన్నా.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్ట పరిహారం పొందాలన్నా.. వివిధ సంక్షేమ పథకాలు, బ్యాంకుల్లో పంట రుణాలు పొందాలన్నా.. ఇలా ప్రతి దానికీ ఈ-క్రాప్‌నే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటోంది. దీనివలన ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుంటూ నిజంగా పంట పండిస్తున్న రైతులకు మేలు చేకూరుతోంది.

దళారులకు చెక్

చాలా మంది దళారులు పంటలు సాగు చేయకుండానే రుణాలు పొందుతున్నారు. దీంతో నిజమైన రైతులకు రుణాలు ఇచ్చే వీలు లేకుండా పోతోంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం దళారులకు చెక్ చెప్పేందుకు రుణాల మంజూరులో కూడా ఈ-క్రాప్‌నే ప్రామాణికంగా తీసుకుంటోంది. ఈ-క్రాప్ ద్వారా రైతులు ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలు సాగు చేశారో గుర్తించి, దాని ఆధారంగా వారికి రుణాలు మంజూరు చేస్తున్నారు.

ప్రతి రైతూ ఈ-క్రాప్ చేయించుకోవాలి



ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ దాదాపు పూర్తి కావస్తోంది. రైతులు వారి పొలాల్లో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో పండించారో ఈ-క్రాప్ బుకింగ్ వెబ్‌సైట్‌లో నమోదు చేశాం. ఎవరైనా రైతులు తమ పంటలు ఈ-క్రాప్ బుకింగ్ చేసుకొనకపోతే వెంటనే నమోదు చేయించుకోవాలి.

– టీవీఎస్ హరి, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి

హైవే పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: సాగరమాల ప్రాజెక్టు కింద జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల (హైవే) నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. ఈ పనుల పురోగతిపై అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె సమీక్షించారు. పోర్టులను హైవేలతో అనుసంధానం చేయడంలో భాగంగా అచ్చంపేట జంక్షన్ నుంచి యాంకరేజ్ పోర్టు వరకూ, అన్నవరం నుంచి వాకలపూడి వరకూ హైవే ప్రాజెక్టులకు సంబంధించి వివరాలను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భవిష్యత్తులో కాకినాడ రూరల్, పట్టణ ప్రాంతాలపై ఎలాంటి ప్రతికూలతలూ లేకుండా, సమస్యలు తలెత్తకుండా ఈ పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారి నిర్మాణానికి అనుగుణంగా విద్యుత్ స్తంభాల మార్పు, నీరు ఎక్కడా నిలిచిపోకుండా డ్రైయిన్ల వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, ఎన్‌హెచ్ఏఐ పీడీ సురేంద్రనాథ్, కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ పి.కృష్ణమూర్తి, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, సర్వే అధికారులు పాల్గొన్నారు.

తాత్విక జీవన విధానం ఎంతో అవసరం

- డాక్టర్ ఉమర్ ఆలీషా
- ఘనంగా ప్రారంభమైన పీఠం వార్షిక మహాసభలు



సభలో ప్రసంగిస్తున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: నేటి మానవాళికి తాత్విక జీవన విధానం ఎంతో అవసరమని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. తాత్విక జ్ఞానం పొందడం ద్వారా అంతర్లీనంగా ఉన్న జ్ఞాననేత్రం తెరచుకుంటుందని చెప్పారు. పిఠాపురంలోని ఆశ్రమ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే పీఠం 96వ వార్షిక మహాసభలను శుక్రవారం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి, ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అనేక ఒత్తిళ్లు, సందేహాలు, అలజడి, అశాంతి, సమస్యలతో మనిషి తన జీవనాన్ని అస్తవ్యస్తం చేసుకుంటున్నాడని అన్నారు. మనస్సును తాత్విక విధానంలో ఆధ్యాత్మిక కోణంలో తీర్చిదిద్దుకోగలిగితే వాటన్నిటినీ పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. మానవుడిని మహనీయుడిగా మలిచే జ్ఞాననేత్రం పొందడానికి గురుముఖంగా ఆధ్యాత్మిక తత్వాన్ని గ్రహించాలన్నారు. విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం వందల సంవత్సరాలుగా ఆధ్యాత్మిక తత్వ ప్రబోధం చేస్తూ, సామాజిక సేవలు నిర్వహిస్తూ, మత సామరస్య సదస్సులతో మానవతా విలువల పరిరక్షణకు పాటు పడుతోందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సభ్యుడు పీఠం ఆధ్వర్యాన చేపట్టిన నా మొక్క – నా శ్వాస కార్యక్రమంలో మూడు మొక్కలు నాటాలని సూచించారు. నాటే ప్రతి మొక్కా ఒక్కో ఆక్సిజన్ సిలిండర్‌తో సమానమన్నారు. ఈ సందర్భంగా పీఠం రూపొందించిన 2024 నివేదికను డాక్టర్ ఉమర్ ఆలీషా ఆవిష్కరించారు. సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ, చిన్నతనంలోనే సాహితీ సేవను ప్రారంభించిన మహనీయుడు శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆరో అధిపతి కవిశేఖర బ్రహ్మర్షి ఉమర్ ఆలీషా అని అన్నారు. 18వ శతాబ్దంలోనే సమాజంలో స్త్రీల వెనుకబాటుతనాన్ని గుర్తించి, వారి ఉద్ధరణకు పాటు పడి, తిరుపతి వేంకట కవులతో సమానంగా అనేక గ్రంథాలు రచించిన మహాకవి అని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం ఆచార్య ఎ.సచ్చిదానందమూర్తి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ, సీఐ శ్రీనివాస్, ఉమర్ ఆలీషా సాహితీ సమితి అధ్యక్షుడు త్సవటపల్లి మురళీకృష్ణ, కార్యదర్శి దాయన సురేష్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అమితంగా ఆకట్టుకున్నాయి.

అన్నవరం దేవస్థానం డిప్యూటీ ఈఓగా చంద్రశేఖర్

అసిస్టెంట్ కమిషనర్‌గా విశ్వనాథరాజు



ఈఓ రామచంద్ర మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలసిన నూతన ఏసీ విశ్వనాథరాజు

అన్నవరం/తుని రూరల్: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం డిప్యూటీ ఈఓగా ఎస్.చంద్రశేఖర్, అసిస్టెంట్ కమిషనర్‌గా పెన్మెత్స విశ్వనాథరాజు నియమితులయ్యారు. వీరిలో చంద్రశేఖర్ శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తూ, పదోన్నతిపై ఇక్కడ నియమితులయ్యారు. అలాగే, తలుపులమ్మ లోవ దేవస్థానం గ్రేడ్–1 ఈఓగా పని చేస్తున్న విశ్వనాథరాజుకు అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి, ఇక్కడ నియమించారు. తలుపులమ్మ లోవ దేవస్థానాన్ని డిప్యూటీ కమిషనర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసి, ఆ దేవస్థానానికి కూడా ఇన్‌చార్జి ఈఓగా విశ్వనాథరాజును నియమించారు. ఆయన శుక్రవారం ఉదయం దేవస్థానానికి వచ్చి, సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఈఓ కె.రామచంద్ర మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. అలాగే, లోవ దేవస్థానంలో కూడా ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయనను లోవ దేవస్థానం ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు విశ్వనాథరాజు తలుపులమ్మ అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు. కాగా, డిప్యూటీ ఈఓగా నియమితులైన చంద్రశేఖర్ గురువారం రాత్రే ఇక్కడకు చేరుకుని, సత్యదేవుని దర్శించిన అనంతరం, జాయినింగ్ రిపోర్టు అందజేశారు.



మొండి స్నానాల రేవులో భక్తుల రద్దీ

భక్తజన సాగరం

- ఘనంగా చొల్లంగి అమావాస్య తీర్థం
- పోటెత్తిన భక్తులు

కరప: చొల్లంగి అమావాస్య తీర్థం సందర్భంగా మండలంలోని ఉప్పలంక శివారు మొండి ప్రాంతం శుక్రవారం భక్తజన సాగరమే అయ్యింది. జిల్లా నలుమూలల నుంచీ సుమారు 70 వేల మంది భక్తులు తరలి వచ్చి ఇక్కడి సాగర సంగమ క్షేత్రంలో పుణ్యస్నానాలు చేశారు. పుష్య అమావాస్య నాడు సముద్ర స్నానం చేస్తే మోక్షం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో సముద్ర స్నానాలకు అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో ఆలయాలు తెల్లవారుజాము నుంచే కిటకిటలాడాయి. పుణ్యస్నానాల అనంతరం మొండిలోని బాలా త్రిపురసుందరీ సమేత సంగమేశ్వర స్వామి, చొల్లంగిలోని రాజరాజేశ్వరీదేవి సమేత సోమేశ్వరస్వామి, కాలభైరవ స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని, సీతారాములు, ఆంజనేయస్వామి వార్లను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కరప పరిసర మండలాల నుంచి పలువురు భక్తులు వీరభద్రుని ప్రభలను, గరగలను తలపై ఎత్తుకుని స్నానాలకు తరలివచ్చారు. పలు గ్రామాల నుంచి అప్పన్నెద్దులను కోలసంబరం పాటలతో ఊరేగింపుగా తీసుకుని వచ్చి సముద్ర స్నానం చేయించి, సోమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పోటెత్తిన భక్తులతో నడకుదురు – గురజనాపల్లి, కాకినాడ – యానాం రోడ్లు రద్దీగా మారాయి. సాగర సంగమమైన మొండి వద్ద ఆలయాన్ని దాత మల్లాడి సత్యలింగం నాయకర్ నిర్మించారు. అప్పటి నుంచీ ఆయన వంశీకులు, దేవదాయ శాఖ ఆధ్వర్యాన ఏటా చొల్లంగి తీర్థం జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్షేత్రం నుంచే పురాణ ప్రసిద్ధిగాంచిన సప్తసాగర యాత్ర ప్రారంభమై, కోరంగి, నాసంగితిప్ప, తీర్థాల మొండి, బ్రహ్మసమేథ్యం, రామేశ్వరం మీదుగా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి తీర్థంతో ముగుస్తుంది.

విస్తృత ఏర్పాట్లు

భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయక్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.బాబూరావు ఆధ్వర్యాన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నదానం నిర్వహించారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యాన కరప ఎస్సై టి.రామకృష్ణ, ఏఎస్సై కె.సూరిబాబుతో పాటు ఇంద్రపాలెం, పెదపూడి, గొల్లపాలెం ఎస్సైలు, పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఎంఎస్ఎన్ చారిటీస్, దేవదాయ శాఖ సిబ్బంది కూడా భక్తులకు సేవలందించారు. స్నానాల రేవు వద్ద ముందుజాగ్రత్తగా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, సర్పంచ్ బొమ్మిడి నయోమి, ఎంపీటీసీ సభ్యుడు కాలాడి కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్ తదితర గ్రామ పెద్దలు కూడా భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప పీహెచ్‌సీ వైద్యుడు ఆర్.శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. అస్వస్థతకు గురైన నలుగురు భక్తులకు వైద్య సేవలందించారు. మొండి వద్ద బాలా త్రిపురసుందరీ సమేత సంగమేశ్వర స్వామివారిని దేవదాయ శాఖ ఇన్‌చార్జి ఆర్‌జేసీ, డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తదితరులు దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. సందట్లో సడేమియా అన్నట్టు.. భక్తుల రద్దీని అవకాశంగా తీసుకుని దొంగలు కూడా చేతివాటం చూపారు. ఒక భక్తురాలు పర్సు, మొబైల్ ఫోన్ పోగొట్టుకుంది. పలువురు తమ జేబుల్లోని నగదును పోగొట్టుకున్నామని తెలిపారు.



మొండిలో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత సంగమేశ్వరస్వామి



చొల్లంగిలో చంద్రుడు ప్రతిష్ఠించిన సోమేశ్వర లింగం

క్లుప్తంగా

బాలికపై లైంగిక దాడి

ఇద్దరు వీఆర్వోలతో సహా ఐదుగురిపై పోక్సో కేసు

నిడదవోలు: విజయనగరం జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన కేసులో ఇద్దరు వీఆర్వోలతో పాటు ముగ్గురిపై నిడదవోలు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. విజయనగరం జిల్లా ఉర్ల మండలం గిరిడ గ్రామానికి చెందిన బాలికకు చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. దీంతో అప్పటి నుంచి తల్లికి దూరంగా ఉంటోంది. ఇదిలా ఉంటే నిడదవోలు పట్టణానికి చెందిన దాడిశెట్టి దుర్గారావు, ఎస్కే అఖిలాండేశ్వరి, బండారు లలిత బాలికకు డబ్బులు అవసరమని తెలుసుకుని వ్యభిచార కూపంలోకి దింపారు. బాలికను గురువారం రాత్రి నిడదవోలు రప్పించారు. బంగారు లలిత ద్వారా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని 9వ సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న ఇంజేటి చిట్టిబాబు, మునిపల్లి గ్రామ వీఆర్వోగా పనిచేస్తున్న పార్ల వెంకటరావు బాలిక గురించి తెలుసుకున్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో తీసుకున్న అద్దె ఇంట్లోకి బాలికను తీసుకువెళ్లి బంగారు లలిత అప్పగించింది. దీంతో ఇద్దరు వీఆర్వోలు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. చివరకు డబ్బుల విషయంలో వీఆర్వోలు, బాలికను తీసుకువచ్చిన బ్రోకర్ల మధ్య గొడవ జరగడంతో విషయం బయటకు వచ్చింది. దీంతో బాలికను విచారించగా నిడదవోలుకు చెందిన షేక్ అఖిలాండేశ్వరి, బండారి లలిత, దాడిశెట్టి దుర్గారావులు బాలికకు డబ్బులు ఎరగా చూపి వ్యభిచార కూపంలోకి దింపినట్లు స్పష్టమైంది. వీఆర్వోలను బ్రోకర్లు డబ్బులు అడగ్గా ఇవ్వని కారణంగా స్థానిక గణపతి సెంటర్‌లో దాడిశెట్టి దుర్గారావుతో పాటు పలువురు పట్టణ వీఆర్వో ఇంజేటి చిట్టిబాబును కొట్టారు. బాలికను వ్యభిచారం కూపంలోకి దింపిన ముగ్గురు, అత్యాచారానికి పాల్పడ్డ ఇద్దరు వీఆర్వోలపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని, ఈ కేసును డీఎస్పీ స్థాయి అధికారులు విచారణ చేపడతారని నిడదవోలు పట్టణ ఎస్సై పులపా అప్పారావు తెలిపారు.



కొవ్వూరు.. కొత్త రూపు

- దీర్ఘకాలిక సమస్యలకు మోక్షం
- చిరకాల స్వప్నంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు
- ఇందిరమ్మ కాలనీలో 1,055 మందికి పట్టాల పంపిణీ
- ఆధ్యాత్మిక కేంద్రంలో ఆహ్లాదకరంగా పార్కులు
- మారిన స్కూళ్లు,పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు
- రూ.39.52 కోట్లతో 350 అభివృద్ధి పనులు
- రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.2.30 కోట్లు
- రూ.1.90 కోట్లతో సుందరీకరణ పనులు


గోష్పాదక్షేత్రం వద్ద అందంగా రూపుదిద్దుకున్న ఏటిగట్టు పార్కు

కొవ్వూరు: కొవ్వూరు కొత్త రూపు సంతరించుకుంటోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే దశాబ్దాల పాటు కలగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించి పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు బాటలు వేసింది. కళాశాల భవన నిర్మాణాల నిమిత్తం ఐదెకరాల భూమి సేకరించారు. వైఎస్సార్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ కాలనీలో ఇళ్లు కొనుగోలు చేసుకుని ఏ పత్రాలు లేకుండా ఉన్న 1,055 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి శాశ్వత హక్కు కల్పించారు. ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి రూపురేఖలు మార్చారు. పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించారు. ఆసుపత్రిలో అవసరమైన అన్ని రకాల సామగ్రి, ఆధునిక పరికరాలు సమకూర్చారు. పేదలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు రూ.2.30 కోట్లతో రెండు అర్బన్ ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. గడచిన 56 నెలల కాలంలో కొవ్వూరు పురపాలక సంఘంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. ఆధ్మాతిక కేంద్రంగా విరాజిల్లుతున్న గోష్పాదక్షేత్రం వద్ద గోదావరి ఏటిగట్టుని రాజమహేంద్రవరం ర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) నిధులతో సుందరంగా తీర్చిదిద్దారు. టీడీపీ హయాంలో అసంపూర్తిగా విడిచిపెట్టిన అవుట్ డ్రెయిన్‌ను రూ.2 కోట్లు వెచ్చించి సుమారు 1,200 మీటర్ల మేర పనులు పూర్తి చేశారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ జూనియర్ బాలుర, బాలిక కళాశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. మునుపెన్నడూ లేని విధంగా కొవ్వూరు పట్టణంలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో 96 ఎకరాల భూమిని సేకరించి మూడు వేల మందికి ఇళ్ల స్థల పట్టాలిచ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వార్డు సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన చేరువ చేశారు. ఇంటింటికీ రేషన్ అందజేత వంటి పథకాలను అమలు చేస్తున్నారు. వివిధ రకాల గ్రాంటులతో 350 పనులకు రూ.39.50 కోట్లు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేశారు. పట్టణంలో 1422.75 మీటర్ల పొడవునా రహదారులు, 988.08 మీటర్లు మేర డ్రైన్‌లు నిర్మించారు. మొత్తం పట్టణంలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.24.11 కోట్ల మేర వెచ్చించారు.

పేదలకు చేరువగా వైద్య సేవలు

పట్టణంలో రూ.2.30 కోట్ల వ్యయంతో రెండు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆధునిక హంగులతో నిర్మిస్తున్నారు. మెరకవీధిలో క్రిస్టియన్‌పేటను ఆనుకుని ఈజీకే రోడ్డు పక్కన రూ.1.07 కోట్లతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మిస్తున్నారు. శ్రీనివాసపురం టోల్‌గేట్ జంక్షన్ వద్ద రూ.1.23 కోట్ల వ్యయంతో మరో పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మిస్తున్నారు. ప్రతీ భవనంలో రెండు ఆపరేషన్ థియేటర్స్, ఫార్మసీ రూము, ల్యాబ్, మినీ వార్డు, వెయిటింగ్ హాలు, లేబర్ రూమ్, మైనర్ వోటీ, మీటింగ్ హాలు, ఓపీ గదులు నిర్మిస్తున్నారు.

చూడముచ్చటగా సుందరీకరణ పనులు

పట్టణంలో రుడా నిధులతో పార్కులు అభివృద్ధి చేశారు. గోష్పాద క్షేత్రం వద్ద ఏటిగట్టుని రూ.1.20 కోట్లతో సుందరంగా తయారు చేశారు. గోదావరి మాత విగ్రహం జంక్షన్ వద్ద రూ.30 లక్షలతో సుందరీకరణ పనులు చేశారు. ఐ లవ్ కొవ్వూరు అక్షరాలు ఏర్పాటు చేసి గోదావరి మాత విగ్రహం చుట్టూ గార్డెన్, వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్డులో రూ.40 లక్షల రుడా నిధులతో డివైడర్‌ను సుమారు కిలోమీటరు పొడవునా సుందరీకరించారు.

అవుట్ ఫాల్ డ్రైన్‌కి మోక్షం

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్‌ను రూ.2 కోట్ల స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులతో నిర్మిస్తున్నారు. నందమూరు – కొవ్వూరు రోడ్డు మార్గంలో ఇరువైపులా సుమారు 1,240 మీటర్ల పనులు పూర్తి కావచ్చాయి. 2015లో గోదావరి పుష్కరాల సమయంలో ఈ అవుట్‌ఫాల్ డ్రైన్‌కి రూ.10కోట్లు మంజూరైనా టీడీపీ ప్రభుత్వం పనులు అసంపూర్తిగా విడిచి పెట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రద్ధ తీసుకుని నిధులు సమకూర్చింది. ఈ మేజర్ డ్రైన్ నిర్మాణం పూర్తయితే పట్టణంలో ముంపు సమస్యకి కొంతవరకు మోక్షం లభిస్తుంది.

పురపాలక సంఘం ముఖచిత్రం

విస్తీర్ణం	: 16.94 చదరపు కిలోమీటర్లు
వార్డులు	: 23
జనాభా	: 39,667
కుటుంబాలు	: 11,307
ఓటర్లు	: 34,131
పురుషులు	: 16,209
స్త్రీలు	: 17,919
ఇతరులు	: 3
వార్డు సచివాలయాలు	: 23
ప్రభుత్వ డిగ్రీ కళాశాల	: 1
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	: 2
ప్రభుత్వ హైస్కూళ్లు	: 4
యూపీ, ప్రాథమిక పాఠశాలలు	: 8
పింఛనుదారులు	: 4,065

2019 నుంచి ఇప్పటి వరకు పురపాలక సంఘంలో చేపట్టిన అభివృద్ధి పనులు

డ్రైన్‌లు	1,422.75 మీటర్లు
రోడ్లు	988.08 మీటర్లు
వెచ్చించిన మొత్తం	రూ.24,10,83,000

2019-20	పనులు	వెచ్చించిన మొత్తం (రూ.)
షెడ్యూలు క్యాస్ట్ కాంపోనెంట్ (ఎస్‌సీసీ)	106	14,65,66,000
స్టేట్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డీఎఫ్)	11	1,33,,81,000
మునిసిపల్ సాధారణ నిధులు(ఎంజీఎఫ్)	2	8,60,0000
14వ ఆర్థిక సంఘం నిధులు	2	5,44,30,000
2020-21		
15వ ఆర్థిక సంఘం నిధులు	24	3,30,00,000
వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు	2	2,30,00,000
నాడు–నేడు పనులు	10	41,23,000
జగనన్న కాలనీల్లో	13	3,25,49,000
మౌలిక సదుపాయాల కల్పనకు		
2021-22		
స్టేట్ డెవలప్‌మెంట్ స్కీమ్	13	1,28,00,000
మునిసిపల్ సాధారణ నిధులు	9	18,83,000
15వ ఆర్థిక సంఘం నిధులు	17	2,65,82,000
2022-23		
మునిసిపల్ సాధారణ నిధులు	43	1,19,63,000
గోదావరి ఫ్లడ్ రిస్టోరేషన్ ఫండ్స్	11	11,41,000
మునిసిపల్ సాధారణ నిధులు	31	1,28,46,000
2023–24 గడప గడపకూ		
మన ప్రభుత్వం నిధులు	56	2,71,40,000
మొత్తం	141	5,30,90,000


సుందరీకరించిన గోదావరి మాత జంక్షన్


నందమూరు రోడ్డులో పూర్తయిన అవుట్ ఫాల్ డ్రైన్


శ్రీనివాసపురంలో పూర్తి కావస్తున్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్ర భవనం


ఇందిరమ్మ కాలనీ వద్ద రూ.75 లక్షలు వెచ్చించి నిర్మించిన సిమెంటు రోడ్డు

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



రానున్న రోజుల్లో కొవ్వూరు పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతా. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కొవ్వూరును సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తా. అవసరమైన నిధులు సమకూర్చుతా. గోష్పాద క్షేత్రం పవిత్రను చాటే చెప్పేందుకు చర్యలు తీసుకుంటా. పట్టణంలో రోడ్లు, డ్రైన్, తాగునీరు, విద్య, వైద్యం వంటి వాటిపై శ్రద్ధ తీసుకుంటా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో పట్టణంలో రూ.39.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం.

– తలారి వెంకట్రావు, గోపాలపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి

పేదోడి సొంతింటి కలను సాకారం చేశాం



పట్టణంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడికీ ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేశాం. అత్యంత ఖరీదైన ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం 96 ఎకరాల భూసేకరణ చేసింది. రెండు ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ద్వారా పేదలకు వైద్య సేవలను చేరువ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పట్టణంలో మౌలిక సదుపాయాల మెరుగుకు ప్రాధాన్యం కల్పిస్తున్నాం.

– బావన రత్నకుమారి, మునిసిపల్ చైర్‌పర్సన్, కొవ్వూరు

ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి



గోష్పాద క్షేత్రం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని రుడా నిధులతో పార్కులు, మెయిన్ రోడ్డును సుందరీకరించాం. గోదావరి మాత జంక్షన్‌ను పట్టణానికి తలమానికంగా సుందరీకరించాం. రానున్న రోజుల్లో అన్నీ ప్రాంతాల్లో ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు చేపడతాం.

– బి.శ్రీకాంత్, కమిషనర్, పురపాలక సంఘం కొవ్వూరు

ఉమ్మడి జిల్లా ఎస్పీలతో ప్రధాన న్యాయమూర్తి భేటీ


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జిల్లా పోలీసు సూపరింటెండెంట్లు, ఉన్నత అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలో అత్యధిక కేసులను పరిష్కరించేందుకు పోలీసు అధికారులు తమ పరిధిలో ఉన్న రాజీపడదగిన కేసులను గుర్తించి ఆ జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందించాలన్నారు. సదస్సులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జీఎస్‌వీ ప్రసాదరావు, జి.వెంకటరత్నం బాబు, తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీష్, కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, కాకినాడ అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, రంపచోడవరం అడిషనల్ ఎస్పీ ఏ.జగదీష్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై దాడి


ముగ్గురిపై కేసు నమోదు

పిఠాపురం: స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో వార్డు సచివాలయ ఉద్యోగులపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పిఠాపురం పట్టణ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం శుక్రవారం సచివాలయంలో జగనన్న కాలనీల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు చేస్తుండగా స్థానిక లబ్ధిదారు గంగాభవానీ వచ్చి తన ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని అడిగింది. అయితే సర్వర్ సరిగా పని చేయడం లేదని ఆలస్యం అవుతుందని సచివాలయ ఉద్యోగి సుధారాణి చెప్పింది. అయితే కావాలనే నాకు రిజిస్ట్రేషన్ చేయడం లేదంటూ దుర్భాషలాడుతూ గంగాభవానీ సుధారాణిపై దాడికి దిగింది. దీనిని అడ్డుకునే ప్రయత్నం చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్ రాంప్రసాద్‌పైనా దాడికి పాల్పడడంతో పాటు తన అక్క, తమ్ముడిని అక్కడకు రప్పించి ముగ్గురు కలిసి సచివాలయ సిబ్బందిపై దాడికి పాల్పడినట్లు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పిఠాపురం పట్టణ ఎస్సై మురళీ మోహన్ తెలిపారు. తమకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు.

పోక్సో కేసులో రెండున్నరేళ్ల జైలు

రాజమహేంద్రవరం రూరల్: బాధితురాలు వెంటబడి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, వేధించిన కేసులో బొమ్మూరు గ్రామానికి చెందిన 23 ఏళ్ల కె.సుధీర్‌కుమార్(సిద్ధు)కు రెండు సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2020 జూలై 26వ తేదీన బాధితురాలు కిరాణా సామానుల కోసం దుకాణానికి వెళ్లగా, ఆ సమయంలో సుధీర్‌కుమార్ బలవంతంగా చేతులు పట్టుకుని తన బైక్ మీదకు లాగాడు. లవంతంగా ముద్దుపెట్టుకొని, ఈ విషయం ఇంట్లో వాళ్లకి చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలు ఇంటికి వెళ్లి తన తల్లికి చెప్పింది. బాధితురాలి తల్లి బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై ఆర్.శివాజీ పోక్సో కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తు చేసిన తరువాత అప్పటి ఎస్పీ ఉత్తర్వుల ప్రకారం కేసును దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. దిశా పోలీస్‌స్టేషన్ అప్పటి మహిళా ఎస్సై రేవతి సమగ్ర దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. తదుపరి ఈ కేసు విచారణలో జిల్లా పోక్సో కోర్ట్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించగా, పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి కేసు విచారణ అనంతరం, పైవిధంగా శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు ట్రైల్ ప్రాసెస్‌ను ఎప్పటికప్పుడు మానిటర్ చేసిన బొమ్మూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉమర్, పోక్సో కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎం.సత్య కుమార్, బొమ్మూరు హెడ్ కానిస్టేబుల్ ఎం.రామకృష్ణను ఎస్పీ జగదీష్ అభినందించారు.

స్నేహితుడి పుట్టిన రోజున రక్తదానం


రక్తదానం చేస్తున్న స్నేహితులు

కాకినాడ క్రైమ్: తమ స్నేహితుడి పుట్టిన రోజున పెద్ద సంఖ్యలో యువకులు రక్తదానం చేశారు. కాకినాడ రూరల్ మండలం తూరంగి రాఘవేంద్రపురానికి చెందిన చెవ్వాకుల సందీప్ పుట్టినరోజును శుక్రవారం అతడి స్నేహితులు ఘనంగా నిర్వహించారు. స్థానికులతో కలిసి వారంతా పుట్టిన రోజు కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చారు. కాకినాడ గ్లాస్ హౌస్ సెంటర్‌లో శ్రీ యువసేన స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో 101 మంది రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. యువసేన వ్యవస్థాపకుడు బొల్లం సతీష్ వారికి సర్టిఫికెట్లు ఇచ్చి సత్కరించారు.

విజ్ఞాణెం

నాణేల సేకరణలో ప్రతిభ చూపుతున్న విద్యార్థిని


తాను సేకరించిన నాణేలతో రేవతి


సింగపూర్ నాణేలు

పిఠాపురం: తరగతి గదితో ఉపాధ్యాయుడు పాఠాలు చెబుతున్నాడు. అంధుల కోసం లూయిస్ బ్రెయిలీ అనే వ్యక్తి లిపి కనిపెట్టాడని, ఆయన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం నాణెం విడుదల చేసిందని చెప్పారు. ఆ నాణెం నాదగ్గర ఉందంటూ ఒక విద్యార్థిని చెప్పడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుడు ఆశ్చర్యపోయారు. అప్పుడు ఆ నాణేన్ని చూపించి ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించాడు ఉపాధ్యాయుడు. నాణేనికి మరో వైపు విజ్ఞానం ఉందని నిరూపిస్తోంది గొల్లప్రోలు మండలం చేబ్రోలు ప్రభుత్వ హైస్కూలు విద్యార్థిని కర్రి రేవతి. పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్న ఆమె చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించే వివిధ దేశాల నాణేలను సేకరించడం హాబీగా పెట్టుకుంది. ఇప్పటి వరకు 50 దేశ విదేశాలకు చెందిన పురాతన నాణేలను సేకరించింది. సింగపూర్, జపాన్, థాయిలాండ్ తదితర దేశాలకు చెందిన నాణేలతో పాటు భారతదేశానికి చెందిన 50 రకాల నాణేలను ఆమె సేకరించింది. ఇండియాకు చెందిన ఐదు రూపాయల నాణేలలో 22 రకాలు సేకరించి అబ్బురపరుస్తోంది. చరిత్రకారులకు చెందిన నాణేలను చూపించి విద్యాబోధన చేయడానికి ఆమె సేకరించిన నాణేలను ఉపయోగిస్తున్నట్లు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు వెంకటరావు తెలిపారు.


లూయిస్ బ్రెయిలీ బొమ్మతో ఉన్న నాణెం

ఎస్‌బీఐలో దోపిడీపై వేగంగా విచారణ


దుండగులు బ్యాంకులోకి ప్రవేశిస్తుండగా రికార్డయిన సీసీ టీవీ ఫుటేజ్

ప్రత్తిపాడు రూరల్: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచిలో సినీ ఫక్కీలో జరిగిన బ్యాంకు దొంగతనం కేసు అందరినీ విస్మయానికి గురి చేసింది. చోరీ జరిగిన తీరును బట్టి ఆరితేరిన అంతర్రాష్ట్ర దొంగలు ఈ దొంగతనానికి పాల్పడినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కొంతకాలం రెక్కీ నిర్వహించి బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో బ్యాంకులోకి ప్రవేశించిన దుండగులు మూడున్నర గంటల సమయంలోనే బ్యాంకును కొల్లగొట్టారు. బ్యాంకుకు కన్నం వేసి లాకర్ దగ్గరకు చేరుకొన్నారు. బ్యాంకులోని నాలుగు లాకర్లలోని రెండు లాకర్లను గ్యాస్ కట్టర్‌తో తెరిచి రూ.27 లక్షలు నగదు, 25 బ్యాగుల్లోని రూ.75 లక్షల విలువ చేసే బంగారాన్ని దోచుకెళ్లారు. ఆరుగురు దొంగలు కారులో వచ్చారు. వారిలో ఇద్దరు కారు దగ్గర ఉండగా మరో నలుగురు బ్యాంకులోకి చొరబడి నగదు, బంగారాన్ని దోచుకెళ్లారు. బ్యాంకులోకి దుండగులు ప్రవేశిస్తున్న దృశ్యాలు సీసీ టీవీల్లో రికార్డు అయ్యాయి. బ్యాంకు వెనుక ఉన్న సుబ్బారెడ్డి సాగర్ ఏటి కాలువ మీదుగా కిటికీ ఊచలను తెరిచి బ్యాంకులో దుండగులు ప్రదేశించారు. బ్యాంకులో చోరీకి గురైన సొమ్ము, నగలకు బీమా మంజూరైదని బ్యాంకు అధికారులు తెలిపారు. గురువారం నుంచి శుక్రవారం వరకు రెండు రోజుల పాటు బ్యాంకు లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండవ శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో సోమవారం నుంచి బ్యాంకు యథావిధిగా పనిచేస్తుందని బ్యాంకు బీఎం కె.అశోక్ నాయక్ తెలిపారు. చోరీకి గురైన లాకర్ల స్థానంలో మరో అత్యాధునిక లాకర్‌ను తీసుకువచ్చి బ్యాంకులో అమర్చారు. లాకర్లను తెరిచిన తీరును బట్టి దొంగతనానికి పాల్పడిన వారు కచ్చితంగా ప్రొఫెషనల్స్ అని పోలీసులు గుర్తించారు. పరిసర సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పోలీసు అధికారులు పరిశీలిస్తున్నారు. ఖాతాదారులు ఎవరూ ఆందోళన చెందవద్దని, వారికి పూర్తి న్యాయం చేస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సారథ్యంలో దర్యాప్తును స్థానిక పోలీసు అధికారులు వేగవంతం చేశారు.